
# వెలుగు పోరాటం

డా.. కొలకలూరి మధుజ్యోతి



హో...! ఆర్తనాదం

'హో... ఆ... ఆ...' అతని కేకలు హెచ్చుతూ తగ్గుతూ కొనసాగుతూ వున్నాయి.

ధడ్‌మని కొట్టుకొంటూ

ఢాం.. అని దేన్నో కొట్టుకొంటూ తగులుతూ

ఫట్... మని కొమ్మలు విరుగుతూ

సర్ర్..మని జారుతూ, ఎటు పోతోందో తెలియకుండా కిందకు పడిపోతూ వుంది... అతని శరీరం.

అతని అరుపులతో ఆర్తనాదాలతో శబ్దాలతో ఆ నిశ్శబ్ద నిశిరాతిరి ఉలిక్కిపడింది. అప్పుడే నిద్రావస్థకు జారుకున్న ప్రకృతి ఒక్కసారిగా కంగారుపడి బిత్తరగా లేచింది.

సర్... మన్న శబ్దం, ఆ... అన్న కేక, చేత్తో ఏదైనా రాయిని ఊతంగా పట్టుకోవాలనే అతని ప్రయత్నం...

అంతలోనే రాయి దొర్లిన శబ్దం.. మళ్ళీ కేక.. అంతా నిశ్శబ్దం. కాళ్ళతో రాయిని చెట్టుని తన్నిపట్టి చేతులతో దేన్నైనా పట్టుకుని తనను తాను ఆపుకోవాలనే తాపత్రయం. శరీరావయవాలన్నీ అన్ని దిశలా పట్టుకోసం తపన పడుతూ విచ్చుకుని వున్నాయి. పడుతూ దొర్లుతూ కొట్టుకుంటూ కిందకు పడే శరీరానికి ఆసరా దొరకటం లేదు.

ధడ్... అని శబ్దం.

ఆ.. కేక.

అతని స్వరం వినిపించడం లేదు. అంతటా నిశ్శబ్దం.. కీచురాళ్ళ ధ్వని ఏదో సంచలనాన్ని చెప్పే ప్రయత్నం చేస్తున్నట్టుంది. ఉలిక్కిపడి మేల్కొన్న ప్రకృతి. ఈ స్తబ్ధతను అర్థంకాక చూస్తూ వుంది.

* * *

అతను రవి. తల్లిదండ్రులకు ఒక్కడే బిడ్డ.

ప్రతి నెలా మొదటి సోమవారం సరైన దారి తెన్నూ లేని ఈ ఎత్తైన కొండకు వేంకటేశ్వర స్వామి దర్శనానికి వస్తాడు. ఈ రోజూ అలాగే వచ్చాడు. దర్శనం కాగానే వచ్చినవాడు వచ్చిన దారిన వెళ్ళలేదు. కొండపైన కొత్తగా అయిన స్నేహితులతో చాలాసేపు గడిపాడు. చీకట్లు కమ్మేవేళ ఇల్లు, అమ్మా నాన్న, భార్యాబిడ్డ గుర్తొచ్చారు. వెళ్ళవలసిన తొందరా గుర్తొచ్చింది. వాళ్ళతో 'ఇక వెళ్తాం' అన్నాడు. కాసేపయ్యాక వెళ్దాం అనీ, రేపు ఉదయం అనీ అన్నారు వాళ్ళు. అక్కడ ఉండబుద్ధి కాలేదు అతనికి. వెళ్ళడా

నికి పూనుకున్నాడు.

"చీకటి... ఒక్కడివే వెళ్ళగలవా?" ఒకడు అడిగాడు.

"వెళ్ళగలను. నాకేం భయం" ఇరవయ్యేళ్ళ వయసు తెచ్చిన పొగరు ఆ గొంతులో.

"చీకట్లో.. సరైన దారే లేదు" ఎవరో హెచ్చరించారు.

" ఏం ఫర్లేదు.. అలవాటైన దారేగా వెళ్తాను" హామీ ఇచ్చాడు రవి.

"చీకట్లో వెళ్ళకపోతేనేం... తెల్లారగానే పోదాంలే వుండు" ఇంకొకరి ఆపే ప్రయత్నం.

"లేదు లేదు. ఇంట్లో చూస్తూ వుంటారు వెళ్ళాలి" భార్యని, మాటలు సరిగ్గా రాని కొడుకుని గుర్తు తెచ్చుకుంటూ చెప్పాడు. భార్యాబిడ్డ గుర్తురాగానే రవికి తొందరెక్కువైంది.

"వస్తాను మరి.." బయలుదేరాడు రవి.

"గుట్టలు రాళ్ళతో నిండిన కొండ. దేవుడు కొలువై ఉన్నాడే కాని సరైన దారి లేదు. జాగ్రత్తగా వెళ్ళు" హెచ్చరించారు రవి వెనుక.

చీకట్లో బయలుదేరాడు. నాలుగు అడుగులు దిగేసరికి రవికి బయలుదేరకుండా ఆగిపోయి వుండవలసింది అనిపించింది. ఇంకొంచెం తడుముకుంటూ తట్టుకుంటూ దాటుకుంటూ చీకట్లో కళ్ళు పొడుచుకుని చూసుకుంటూ, చెట్లను గుట్టరాళ్ళను బండరాళ్ళను ఆసరా చేసుకుంటూ దిగుతున్నాడు. కొండకు రావటం అలవాటయిన పాదాలు. కాని అలవాటుకు భిన్నంగా అడుగులు పడుతున్నాయి. రవికి అనుమానం మొదలయ్యింది. క్షణాలలోనే అది ఖరారైంది. రవి దారి తప్పాడు. దారి తప్పాను.. అనుకోగానే రవిలో కంగారు ఆరంభమయ్యింది. అడుగులు తడబడుతున్నాయి. తడబడిన అడుగు చిన్న రాయి చివర పడింది. అది జారింది. దానిపైన కాలేసిన రవి శరీరం జారింది. వెనుకేక రవి గొంతులో గింగిరాలు తిరిగి కీచుమని బయటపడింది.

తూలాడు... జారాడు..

పడ్డాడు...పట్టు దొరకలేదు...

అలా... అలా... జారిపోయాడు.

* * *

రవి కళ్ళు తెరిచాడు.

తెప్పరిల్లాడు..

జరిగింది గ్రహించుకున్నాడు. ఎక్కడున్నాడో చూసుకున్నాడు. ఒక బండరాయిపై బోర్లాపడి ఉన్నాడు. నిట్టూర్చాడు. తలపై గాయం అయినట్టు వుంది. తుడుచుకున్నాడు. వెచ్చటి రక్తం. కొట్టుకుపోయి రక్కుకు పోయిన కాళ్ళు చేతులు మంటను నెప్పిని చెబుతున్నాయి. బట్టలక్కడక్కడా చిరిగాయి.

లేచి కూర్చోటానికి ప్రయత్నించాడు.

కుదరలేదు.

పక్కకు తిరిగే ప్రయత్నం చేశాడు.

కుదరలేదు.

బోర్లాపడిన రాయి కడుపుకు చేతులకు ఆసరాగా వుంది.

కాళ్ళకు నేల అందలేదు. అందటం లేదు.

కాళ్ళకు ఒకపక్క వేళ్ళకు రాయి- బోర్లాపడి వున్న రాయి తగులుతూ వుంది.

కాలి మడమ మరో రాయికి తగులుతూ వుంది.

రెండు రాళ్ళ మధ్య కాలు ఇరుక్కుపోయి వుంది. రవి కదిలినప్పుడల్లా ఓ అంగుళం కిందకి జారుతున్నాడు. పాదాలు ఇరుక్కుపోవడంతో వాటికి విముక్తి కలిగించే ప్రయత్నం అప్రయత్నంగా మొదలు పెట్టాడు.

మోకాళ్ళ వరకు ఊతంగా వున్న వెనక రాయిని వెనక్కు నెట్టినట్టుగా తోశాడు. రాయి కదలలేదు. రవి ప్రయత్నం మరో ఫలాన్నిచ్చింది. కాస్త జారాడు. కాళ్ళకు ఇరుకు తగ్గింది. రెండోసారి గట్టిగా ప్రయత్నించసాగాడు.

సర్రున జారాడు. ఎడాపెడా కొట్టుకుంటూ గీసుకుంటూ రాసుకుంటూ జారిన కాళ్ళకు నేల దొరికింది.

నేల దొరికిన ఆనందం అందే లోపే రవికి జరిగిన ప్రమాదం అర్థమయ్యింది. రవి రెండు నిలువైన కొండరాళ్ళమధ్య ఇరుక్కుపోయాడు.

* * *

కదలటానికి మెదలటానికి లేని ఇరుకు.

పైకి కిందికి కదిలే మార్గం లేదు.

పక్కనుంచి రావటానికి ప్రయత్నించాడు.

నిస్సత్తువ.
కడుపులో రగులుతున్న ఆకలి...
ఇల్లు చేరాలంటే ఆరాటం.
తానున్న స్థితి నుంచి
బయటపడాలనే పోరాటం..
వీటివలన నిస్సత్తువ.
తానున్న స్థితిని తల్చుకుని
భయం..
కళ్ళు చించుకుంటే అంతంత
మాత్రంగా కనిపించిన చెట్లు
రాళ్ళూ రప్పలు ఇప్పుడేమీ
కనిపించడం లేదు.

ప్చ్..లాభం లేదు.

శరీరాన్ని చేతులను కాళ్ళను నిటారుగా నిలిపి ఊపిరి బిగపట్టి పక్కకు జరగటానికి చూశాడు.

కుదరలేదు.

శరీరంలో భాగాలన్నిటిని లోలోపలికి బిగపట్టుకుని శరీరాన్ని బయటకు తొయ్యాలని చూశాడు.

అంతంత లావున్న రాళ్ళు.. రవి ప్రయత్నాన్ని సాగన్వీలేదు. గింజుకోవటానికి లాక్కోవటానికి లేని స్థితిలో తాను ఇరుక్కున్నానని స్పష్టమైంది రవికి.

తనను తాను రక్షించుకోలేననీ అర్థమయింది.

నిస్సత్తువ.

కడుపులో రగులుతున్న ఆకలి...

ఇల్లు చేరాలంటే ఆరాటం.

తానున్న స్థితి నుంచి బయటపడాలనే పోరాటం..

వీటి వలన నిస్సత్తువ.

తానున్న స్థితిని తల్చుకుని భయం..

కళ్ళు చించుకుంటే అంతంత మాత్రంగా కనిపించిన చెట్లు రాళ్ళూ రప్పలు ఇప్పుడేమీ కనిపించడం లేదు.

చుట్టూ రాయి. శరీరానికంతటికి తెలుస్తూ వుంది. పైన ఏముందో చూడటానికి కూడా తలెత్తి చూడలేని స్థితి. నిస్సత్తువకు భయం నిరాశ తోడవుతూ వున్నాయి.

* * *

"నాయినా ఈరోజు కొండకు పోయొస్తాను" చెప్పాడు రవి.

" ఈయేళ పోకపోతే నేమిరా? బిడ్డకి పుట్టిన రోజుకి బట్టలు తెస్తనంటివి పోయిరా!" అన్నాడు తండ్రి.

"దానికి రేప్పోవచ్చులే" ముచ్చటగా ఒదిగి కూర్చున్న భార్య లక్ష్మి ఒడిలో నుంచి కొడుకును ఎత్తుకుంటూ సమాధానమిచ్చాడు రవి.

కడుగునీళ్ళు పారబొయ్యడానికి ఇంట్లోనుంచి వచ్చిన తల్లి "బేకారుగా ఎందుకురా తిరుగుతావు? ఏదైనా పని చూసుకోరాదా? పెండ్లైయ్యే, పిల్లాడు బుట్టే. నువ్వేమో కుదురుకోకపోతివి. ఇంగైనా కుదురుకో నాయనా" అంది. ఆ గొంతులో హెచ్చరిక, బుజ్జగింపు రెండూ వున్నాయి.

"నువ్వు మొదలుబెట్టినావా మళ్ళీ..అలాగేలే. ఏదైనా పనిచూసుకుంటా.." అని భార్యవైపు తిరిగి "వెళ్ళొచ్చేదా... శనివారం కదా బుడ్డోడి పుట్టినరోజు, రేపెప్పుడో ఇద్దరమెళ్ళి కొండాంలే" బుజ్జగించినట్టు చెప్పాడు.

తన మాటకు ముచ్చటగా తల ఊపుతున్న భార్యను, ఆమె తల ఊపినప్పుడు కదులుతున్న జూకాలను, తలలోని పూలను మోహంగా చూస్తూ కదిలాడు. భర్త మొహంలోని మార్పులకు ఆ భార్య మొహం సిగ్గుతో మరింత అందాన్ని సంతరించుకొంది. ఆ చక్కని రూపును కళ్ళలో నింపుకుని రోడ్డు వైపు కదిలాడు రవి.

* * *

నిస్త్రాణంగా వున్న రవి కొద్దిగా తెప్పరిల్లాడు.

తన పరిస్థితి మననం చేసుకున్నాడు. మరోసారి కదలటానికి ప్రయత్నించాడు. కుదరలేదు. ఎవరినైనా పిలవాలనుకున్నాడు. ఇంత రాత్రి సమయంలో చుట్టుపక్కల ఎవరైనా వుంటారా? ఉండరు. మరేం చేయాలి? అసలు టైం ఎంతయ్యింది? తెల్లవారే దాకా ఆగాలి. అరవాలి. ఎవరైనా వింటారేమో.. ఇలా అనుకోగానే కాస్త తెరిపిన పడింది ఆలోచన.

"ఇంట్లో ఎదురుచూస్తూ వుంటారేమో నాకోసం" అనుకున్నాడు.

అనుకోగానే.. వచ్చేటప్పటి భార్యముఖం, ఆ అందం గుర్తొచ్చాయి. లేత నవ్వు విరిసింది రవి పెదవులపైన.

"ఆ అందమైన అమాయకమైన మొహమే కదా ఈ పెళ్ళికి కారణమయ్యింది"అనుకున్నాడు.

రవి, లక్ష్మీలది ప్రేమ వివాహం. రవి ఇంటర్ రెండో సంవత్సరంలో వుండగా లక్ష్మిని చూశాడు. తను కాలేజీలో అప్పుడే చేరింది. ఇద్దరూ ఇష్టపడ్డారు. తమ ఇష్టాలను పెద్దలకు కూడా చెప్పకుండానే పెళ్ళి చేసేసుకున్నారు. లక్ష్మీ ఇంట్లో ఇది బాధ కలిగించింది. రవి ఇంట్లో ఇది తప్పనిసరై ఒప్పుకున్నారు. పద్దెనిమిదేళ్ళ రవి చదువు పాడుచేసుకుని పెళ్ళి చేసుకున్నాడు. వెంటనే కొడుకు కలిగాడు. వీరిద్దరి మధ్య రాజుకున్న ప్రేమాగ్ని ఇంకా తగ్గుముఖం

పట్టలేదు. ఒకరంటే ఒకరికి వున్న ఇష్టం, మాట రూపంగా కంటే చేత రూపంలో ఉండటం విశేషం.

అమ్మా నాన్నలపై ఆధారపడే వుంది రవి సంసారం. తల్లిదండ్రుల బెంగ రవికి ఇప్పుడిప్పుడే అర్థమవుతూ వుంది. 'పెళ్ళి సుఖంగా ఉన్నా కాని చదువు ఆపుకోకుండా వుండాల్సింది' అనుకున్నాడు రవి. పదో తరగతి డెబ్బై శాతంతో పాసై, ఏదో సాధించేశానన్న విజయోత్సాహం తలలో స్వారీ చేస్తుంటే, ఇంటర్లో వీరవిహారం చేశాడు. అయినా చదువు గాడి తప్పలేదు. ఎంపిసి తీసుకుని అరవైశాతం తెచ్చుకున్నాడు. అప్పుడే అనుకున్నాడు సెకండియర్‌లో ఇంకా ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలి అని. రవి చదువుతో ప్రమేయం లేకుండా జీవితం లాక్కొచ్చేసింది.

'నాన్న చదువుకో అంటున్నాడు, చదువుకోవాలి. ఇంటర్ ఇక అనవసరం. ఏదైనా డిగ్రీ ఓపెన్ యూనివర్శిటీలో చెయ్యాలి' అనుకున్నాడు.

'ఎంత తెలివైన వాడిని, చదివితే బాగా వుంటుంది. తప్పకుండా చదువుకుంటాను' గట్టిగా నిర్ణయం తీసుకున్నాడు.

ఇలా ఆలోచిస్తూ మగతలోకి జారుకున్నాడు రవి.

* * *

తెలవారుతూ వుంది.

పక్షుల శబ్దాలతో రవి మెల్లగా కళ్ళు విప్పాడు.

లాగుతున్న కాళ్ళు, కదలలేని శరీరం ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోనే పని పెట్టలేదు.

తన కర్తవ్యం గుర్తొచ్చింది రవికి.

''రక్షించండి.. ఎవరైనా వున్నారా?'' అరిచాడు. ఆగాడు. మౌనంగా వున్న ఆ పరిసరాలలో ఆ గొంతు చాలా దూరం ప్రయాణం చేసింది. రెవులు రిక్కించి విన్నాడు... సమాధానం లేదు.

మళ్ళీ అరిచాడు.

మళ్ళీ మళ్ళీ అరిచాడు. ఈ అరుపులే గాలిలో ఒకదానినొకటి పలకరించుకుంటున్నాయి కాని, తిరుగు సమాధానం రావటం లేదు. నీరులేక నోరు పిడచకట్టుకు పోతోంది. అరచి అరచి అలసట వచ్చి ఆగిపోయాడు రవి.

ఇంకాస్త సమయం గడిచింది. లీలగా ఏదో ధ్వని.. గుంపుగా జనం వస్తున్నట్టు. రొదరొదగా స్పష్టత లేని మాటల శబ్దం. చెవి రిక్కించి విన్నాడు రవి. వినటం ఆపి మళ్ళీ అరిచాడు. రెండోసారి అరిచాడు. ఆగాడు. విన్నాడు. తానింతకు పూర్వం విన్న శబ్దమేమీ ఇప్పుడు లేదు. వారు, తన అరుపు విన్నారేమోననే ఆనందంతో మళ్ళీ అరిచాడు. విన్నాడు. ఎలాంటి చప్పుడూ వినిపించలేదు. నీరసం వచ్చింది రవికి. 'తాను భ్రమపడి వుంటాను' అనుకున్నాడు.

'ఎవరైనా వస్తారని చూస్తున్నా కదా.. అందుకే అలాంటి భ్రమ కలిగి వుంటుంది' అని తనను తాను ఊరడించుకున్నాడు.

అంతటా నిశ్శబ్దం.

మళ్ళీ చప్పుడు వినిపించింది. ఈసారి స్పష్టంగా.

రవికి హుషారు. 'ఎవరైనా వున్నారా..?' తిరిగి ప్రశ్న వచ్చింది.

ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు రవి.

'ఇక్కడున్నాను. ఈ రెండు బండరాళ్ళ మధ్యన ఇరుక్కుపోయాను' అరిచాడు.

వాళ్ళు బండరాళ్లు. దానిమధ్య ఇరుక్కునే అవకాశమున్న బండరాళ్ళను వెదికి వెదికి అరగంటకి రవి సమీపంలో తేలారు.

తనదగ్గరకు రాగానే 'ఈ రాళ్ళలో ఇరుక్కున్నాను. రక్షించండి' అంటూ ఓ పక్కనుంచి చేయి ఊపాడు. చేతివేళ్ళ కదలికను చూసి ఆ వైపు వచ్చి నిల్చున్నారు వాళ్ళు. ఆ వేళ్ళలో తన చేతిని జొనిపి లాగాడు ఒకడు. రాలేదు. బలంగా లాగాడు. బాధతో రవి అరుపు. బయటకు వచ్చిందే కాని, రవి ఇసుమంతైనా కదలలేదు. ఆ పక్కకు తిరిగి రాళ్ళను తడిమి చూశారు. తొంగి చూశారు. రాళ్ళను తలెత్తి, అంతెత్తు వుండటం చూశారు. ఇన్ని రకాలుగా చూశాక కాని అవి వున్న పరిస్థితి ఎంత తీవ్రంగా వుందో అర్థం కాలేదు. అంతసేపూ తను ఒక్కడుగా పడ్డ బాధను రవి వారికి పంచాడు. వారు ఆ బాధను తమ బాధ్యతగా చేసుకున్నారు. ఎలా రవిని బయటకు తీయాలి అనే తర్జన భర్జనల్లో పడ్డారు.

లీలగా ఏదో ధ్వని.. గుంపుగా జనం వస్తున్నట్టు. రొదరొదగా స్పష్టత లేని మాటల శబ్దం. చెవి రిక్కించి విన్నాడు రవి. వినటం ఆపి మళ్ళీ అరిచాడు. రెండోసారి అరిచాడు. ఆగాడు. విన్నాడు. తానింతకు పూర్వం విన్న శబ్దమేమీ ఇప్పుడు లేదు. వారు, తన అరుపు విన్నారేమోననే ఆనందంతో మళ్ళీ అరిచాడు. విన్నాడు. ఎలాంటి చప్పుడూ వినిపించలేదు. నీరసం వచ్చింది రవికి.

'దాహం..' అడిగాడు రవి.

వాళ్ళు తెచ్చుకున్న బాటిల్ బయటకు వచ్చిన చేతికి ఇచ్చారు. చేతిలో నీరు వున్నా తాగలేని పరిస్థితి. చేతిని పైకి కిందకి కదపగలిగాడు కాని, ముందుకు తెచ్చుకోటానికి కాని, తలయెత్తి తాగే స్థితి కాని లేదు. రవితోపాటే బయటున్న వారికి పరిస్థితి అర్థమయింది. ఎలాగో కష్టపడి మూతి వంకరగా పెట్టి, బాటిల్ కొసను ఆనించి తాగాడు. కిందపోయినన్ని పోగా, రవి నోరు తడి అయింది.

''అసలెలా పడ్డావూ?'' ప్రశ్నించారు.

రవి గోలగోలగా తనేవిధంగా పడిందీ చెప్పాడు. వాళ్ళు నొచ్చుకున్నారు. ధైర్యం చెప్పారు. ఇంతలో ఒకడు ''పైనుంచి కదా పడ్డాడు. పైనుంచే లాగుదాం'' ప్రతిపాదించాడు. సరేనంటే సరేననుకున్నారు. రవితో చెప్పారు. బండరాళ్ళను చూశారు. ఆరడుగుల మనుషులు ఒకరిపై ఒకరు నిల్చున్న దానికంటే ఎత్తున్నట్టుంది. ఎలా తియ్యాలి? అటూ ఇటూ వెదికి పొడవుగా బలంగా వున్న కొమ్మను ఎంచుకున్నారు. ఒక బండరాయి ఎక్కేపనిలో పడ్డారు. నిలువెత్తు బండరాయి ఎక్కటానికే ఆయాసం వచ్చింది వారికి. విషయాలను గ్రహిస్తూ వింటూ వున్న రవి సిద్ధంగా వున్నాడు. పై నుండి కర్రను ఒడుపుగా రెండు రాళ్ళ మధ్యనుంచి కిందకు జరిపారు. రవి రెండు చేతులతో దానిని పట్టుకున్నారు.

''లాగమా?'' అడిగారు.

''సరే...'' చెప్పాడు రవి.

లాగారు. రవి కొంచెం జరిగాడు. ఇంకొంచెం లాగారు.. రవి కదలలేదు. ఎండ తీవ్రతకు కర్రపై పట్టు జారుతూ వుంది. ఒకరి తర్వాత ఒకరు చేతులు తుడుచుకుని ఒక్కదుటున లాగారు. ప్చ్...లాభం లేదు.

''వదలొద్దు..పట్టుకునే వుండు'' చెప్పారు.

''అలాగే...''

ఈసారి కర్రను కొంచెం వంచి, చేయి బయటకు కనపడుతున్న వైపునుంచి లాగారు. శరీరం ఓర్చుకుంటూ సాగిందే కాని కదలలేదు. అలా కూడా సాధ్యం కాదని స్పష్టమయింది. జారుతున్న చేతులతో గట్టిగా పట్టు బిగిస్తూ ''వదిలేయనా'' అడిగాడు.

''ఊ'' పైనుంచి సమాధానం.

కర్రను వదిలేసి పూర్వపు స్థితిలో నిలబడి గట్టిగా ఊపిరి తీసుకున్నాడు రవి.

సాయంత్రం అవుతూ వుంది. కొండపైని కలకలం కిందకి చేరి గ్రామస్థుల గుంపులు గుంపులు గుంపులుగా వస్తున్నారు చూడటానికి.

ఇంతలో ''నాయనా రవి...'' ఆక్రోశంగా వినిపించింది రవికి తండ్రి గొంతు.

''నాన్నా వచ్చావా...? తెలిసిందా?'' రవి గొంతులో అయినవారు దగ్గిరే వున్నారన్న తృప్తి.

''ఇలా ఎలా జరిగిందిరా తండ్రీ?'' తండ్రి గొంతులో సుడులు తిరుగుతున్న దుఃఖం.

''ఫర్వాలేదులే.. లాగేస్తారు బయటికి'' హామీ ఇచ్చాడు రవి.

''అమ్మేం చేస్తోంది? అమ్మకు లక్ష్మికి తెలుసా?'' తిరిగి అడిగాడు రవి.

''లేదురా. నీకోసం ఎదురు చూస్తున్నాం. నేను టీకొట్టు దగ్గరికొస్తే విషయం తెలిసి పరిగెట్టుకొచ్చాను'' తండ్రి చెప్పాడు.

తండ్రీ కొడుకులు మాట్లాడుకొంటుంటే కొందరు జాలిగా ఇటే చూస్తున్నారు. వారి చర్చలు పూర్తయ్యేసరికి చిరు చిరు చీకట్లు కమ్ముకుంటున్నాయి. రాయి తొలగించనిదే కనీసం కదల్చనిదే రవిని బయటకు తీయటం అసాధ్యం అని తీర్మానించుకొన్నారు. చీకటి పడుతోంది కనుక ఇక రేపే పని చేద్దాం అనుకున్నారు. మెల్ల మెల్లగా జనం పల్చపడ్డారు.

ఎవరూ చెప్పకపోయినా జరుగుతున్నది తెలుస్తూ వుంది రవికి.

''నాన్నా! నువ్వు ఇంటికెళ్ళు చీకటి పడక ముందు'' చెప్పాడు రవి.

''నిన్నిలా వదిలి ఎలా వెళ్ళనురా...?'' తండ్రి గొంతులో అణచుకుంటున్న ఏడుపు రవికి తెలిసింది.

''నువ్వుండి ఏం చేస్తావు? ఇంట్లో ఆడోళ్ళు ఇబ్బంది పడతారు నువ్వెళ్ళు. జాగ్రత్తగా వెళ్ళు. నాలా ఇరుక్కునేవు'' హాస్యంగా అని నవ్వాడు. కొడుకు ధైర్యంగా నచ్చజెప్పగా తండ్రి కదిలాడు. అందరూ వెళ్ళిపోయారు.

చీకట్లో ఒంటరిగా, తనది కాని ప్రదేశంలో కొండరాళ్ళ మధ్య తిండిలేకుండా, ఎవరో ఇచ్చిన నీటి బాటిల్ని జాగ్రత్తగా పట్టుకుని, రాళ్ళమధ్య ఇరుక్కుని రెండో రాత్రికూడా అలా నిల్చున్నాడు.

* * *

నిశిరాత్రి...

కీచురాళ్ళ ధ్వని..

మగత కమ్ముతూ.. తేరుకుంటూ.. తొలిపొద్దు కోసం ఎదురు చూస్తున్నాడు రవి.

'లక్ష్మీ ఏం చేస్తోందో?'

'పిచ్చిది దిగులుతో ఏడుస్తూ వుండి వుంటుంది'

'ఇంటికెళ్ళగానే రేపు ఓదార్చాలి'

'చిన్నోడు ఎలా ఉన్నాడో...?'

'రేపు, పుట్టినరోజుకి బట్టలు కొనాలి ముందు.. ఆ పని దాటేసి వచ్చాను' చిన్నాడి బోసినోరు, వచ్చీ రాని పళ్ళతో దొరికిన వాటినల్లా కొరికేసే వాడి గుణం గుర్తు తెచ్చుకుని హాయిగా నవ్వుకున్నాడు.

ఇలా ఆలోచిస్తూ, మగతలోకి జారుతూ తుళ్ళిపడుతూ ఆ రాత్రి గడిపాడు.

* * *

తెల్లవారింది.

జనం గుంపులుగా వస్తున్నారు కొండపైకి.

ఈసారి చాలా చాంతాడులు తెచ్చారు.

వారి రాకతో పూర్తి చైతన్యంలోకి వచ్చాడు రవి.

నిద్ర మగతలో ఎప్పుడో జారిపోయిన బాటిల్ గుర్తొచ్చింది. ఆకలి దప్పులు గుర్తొచ్చాయి.

''కొంచెం నీళ్ళివ్వండి'' అడిగాడు.

''నాయనా రవి ఎలా వున్నావురా'' తండ్రి గొంతు వినపడింది.

''బావున్నాను. లక్ష్మీ ఏం చేస్తూ వుంది''

'' ఏడుస్తూ వుందిరా. ఇదిగో నీకోసం గంజి చేసిచ్చింది. నువ్విలా వున్నావని తిండి తినే వీల్లేదని తెలిసి కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. ఇది చేసిచ్చింది. వస్తానని ఒక్కటే పట్టు. బిడ్డతో కష్టం వద్దని ఆపేశాను. మీ అమ్మది అదే గోల''

తండ్రి మాటలకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. గుండెల్లో బాధ సుళ్ళు తిరిగింది. మౌనంగా తండ్రి ఇచ్చిన జావ కాస్త జాగ్రత్తగా తాగాడు. అంతా కింద పోకుండా కాస్త కడుపులోకి జారింది. ఆకలితో అలమటిస్తున్న కడుపు కొంత సేద తీరింది. దప్పికా తీరింది.

తాళ్లు మూడింటిని కొండ దిగువవైపున్న బండరాయికి వేశారు. దూరదూరంగా నిల్చుని దానిని దిగువకు లాగడానికి ఆలోచించారు. దొర్లితే ఎంత దూరం దొర్లుతుంది.. ఎక్కడ ఎలా ఆగుతుంది.. ఏ బండరాయి దాని తాకిడికి తట్టుకోగలుగుతుంది అంచనా వేశారు. ఆ దిశలో ఎవరూ రాకుండా వెళ్ళకుండా కొందరు కాపలా నిల్చారు. అటువైపు పదిమంది ఇటువైపు మరో పదిమంది నిల్చున్నారు.

మిట్టమధ్యాహ్నం అయింది ఈ మంతనాలలోనే. ఎండ తీవ్రత అందరినీ ఇబ్బంది పెడుతూ వుంది. చెమటలు దిగకారుతూ వున్నాయి. జరుగుతున్న సంభాషణలు వింటూ, జరిగేది ఊహిస్తూ ఓరగా చూడటానికి ప్రయత్నిస్తూ నిల్చున్నాడు రవి.

అందరూ ఒక్కసారి ఒక్కపెట్టున కిందకి లాగారు. ఇందరి శ్రామికుల శ్రమ, ఆ బండరాయి ముందు గడ్డిపోచే అయింది. ఇంకా గట్టిగా లాగారు. కుదరలేదు. మరికొందరు వారికి జత అయ్యారు. ఫలితం లేదు.

ఈ సారి పలుగులతో కొందరు అవతలి కొండ రాయి ఎక్కి, అటు నాలుగు, ఇటు నాలుగు పలుగులుపెట్టి బలంగా తోస్తుండగా చేంతాళ్ళను లాగారు. బలంగా లాగారు. రాయి కొద్దిగా కదిలినట్టు అయ్యింది. ఇక దొర్లిపోవడమే తరువాయి. రెట్టించిన ఉత్సాహంతో మళ్ళీ లాగారు. రాయి రాయే. కదలలేదు. సాయంత్రం అవుతూ వుంది. ప్రయాసే మిగులుతూ వుంది. వచ్చేవారు వస్తున్నారు. వెళ్ళేవాళ్ళు వెళ్తున్నారు.

ఎవరందజేశారు ఎలా తెలిసిందో కాని ప్రభుత్వాధికారులకు తెలిసింది. వచ్చారు. జరుగుతున్న ప్రయత్నాలు సమస్య తీవ్రతను చెప్పకనే చెప్పాయి వారికి. వారి రాకతో ఒక్కసారిగా హడావిడి మొదలయ్యింది. సమస్య గ్రామస్థుల చేతినుంచి అధికారుల చేతులలోకి వెళ్ళింది. మళ్ళీ తర్జనభర్జనలు మొదలు. జరిగిన ప్రయత్నాలన్నీ తెలుసుకున్నారు. ఎక్కడి నుంచి మొదలు పెట్టాలో ఆలోచించాలిక.

ఏం చెయ్యాలి...? ఎలా చెయ్యాలి? ఇవే ప్రశ్నలు. వాటికి సమాధానం వెదకడంలోనే... కాలం గడిచింది. సాయంత్రం కావటంతో అధికారులు రవికి ధైర్యం చెప్పి, మరోసారి ఏదైనా జావ తాగించమని చెప్పి వెళ్ళారు. ఎవరో తెచ్చిచ్చారు. ఎవరెవరో రవితో మాటలు కలుపుతూ వున్నారు.

చీకటవుతూ వుంది. సద్దుమణుగుతూ వుంది.

''నాన్నా!'' పిల్చాడు రవి.

నిస్సత్తువగా కూర్చుని జరిగే తంతు చూస్తున్న తండ్రి ఒక్క అంగలో దగ్గరికి వచ్చాడు. ''ఏం నాయనా?'' అడిగాడు.

''ఏమైనా తిన్నావా?'' ఆరాగా అడిగాడు రవి.

సమాధానం లేదు.

''బెంగెందుకే. ఆఫీసర్లొచ్చారుగా.. రేపు పనైపోతుంది. పో... పోయి తిండి తిని పండుకో'' అని చెప్పాడు.

ఈసారీ సమాధానం లేదు.

''పో నాన్నా. ఇంటిదగ్గర నీ అవసరం వుంది'' బాధ్యత గుర్తు చేస్తూ చెప్పాడు రవి.

''ఎట్లారా...?'' తండ్రి గొంతులో దుఃఖం.

''వెళ్ళాలి... తప్పదు''

''సరే...'' బలహీనంగా చెప్పి, నీళ్ళ సీసా కొడుకు చేతికిచ్చి వెనుదిరిగాడు తండ్రి. వెనుదిరిగాడే కానీ వెళ్ళలేదు. అక్కడే రాయిపై పడుకున్నాడు. తండ్రి అక్కడ నుంచి వెళ్ళలేదని గ్రహించాడు రవి.

చీకటి... ఒంటరితనం.. కీచురాళ్ళ ధ్వని.. మళ్ళీ మామూలు.

* * *

అధికారులు రావటం రవి జారిపోతున్న ధైర్యాన్ని నిలబెట్టింది. 'రేపు ఎలాగైనా నన్ను బయటకు తీసేస్తారు' అనుకున్నాడు. తండ్రి బాధ గుర్తొచ్చింది... 'కన్న తండ్రి ప్రేమ అనుకున్నాడు' పొమ్మన్నా పోని తండ్రి ప్రేమకు రవి కదిలిపోయాడు. కొడుకేం చేస్తున్నాడో అనుకున్నాడు.

పడిపోతున్నా పట్టుకోండి పట్టుకోండి అన్నట్టు తడబడుతూ తూలుతూ ఊగుతూ సాగే వాడి నడక బుడి బుడి పాదాలు గుర్తొచ్చాయి. వాడు నవ్వినప్పుడు బుగ్గన పడే సొట్ట, మెరిసే ఆ కళ్ళు కంటి ముందు నిల్చాయి. గర్వంతో తండ్రి హృదయం ఉప్పొంగింది. వాడిని తల్చుకునే సరికి వాడిని హృదయానికి గాఢంగా హత్తుకోవాలనే కోరిక మనస్సులో పెల్లుబికింది. అనురాగం ముప్పిరిగొని ఉక్కిరిబిక్కిరి చేసేసింది.

'రేపు ఇంటికి వెళ్ళగానే ముందు వాడిని వాటేసుకోవాలి. ఆడుకోవాలి. తర్వాతే ఏ పనైనా, వాడికి బట్టలు కొనే పనైనా' అనుకున్నాడు. పగలంతా శరీరమంతా చెవులు చేసుకుని రిక్కించి జరుగుతున్న ప్రయత్నాలన్నీ విన్న అలసట మగతగా కమ్ముకుంది.

* * *

పూర్తిగా తెల్లవారనే లేదు.

రవికి దుర్వాసనతో మెలుకువ వచ్చింది. నిన్నటి దాకా ఈ అవసరం తెలియలేదు కాని, పగలు ఎండకు రెండు రాళ్ళ మధ్య, పగటి వేడికి వేడెక్కిన రాళ్ళమధ్య రాత్రి, ఇలా పగలూ రాత్రి వేడికి కాగిన శరీరం ఇప్పుడు రవి అదుపులో లేదు. ఎప్పుడో నిద్రలోనే విరేచనమైపోయింది. అదే దుర్వాసన. ఏం



## ఒద్దికయిన రోబో

ఇంతవరకూ మనం రోబోట్లు చెప్పిన పనులు చేస్తాయని విన్నాం. అయితే ఈ రోబో మనం గీచిన గీటు కూడా దాటదు. పైపెచ్చు మనం ఒక తెల్లకాగితం మీద ఒక నల్లని గీత గీస్తే బుద్ధిగా ఆ గీతనే గమనిస్తూ కూర్చుంటుంది. కాంతిని అదుపు చేసే లైట్ ఎమిటింగ్ డయోడ్, ఫొటో ట్రాన్సిస్టర్ల సాయంతో తెల్లకాగితం మీద గీసిన నల్ల ఇంకును గుర్తించి, గీత ఎక్కడా వంకర పోకుండా తిన్నగా వుండేలా చూస్తుంది. దీన్ని ఊడదీయడమూ, బిగించుకోవడమూ కూడా చాలా సులువు. ఒక స్క్రూ డ్రైవర్, కటర్ వుంటే చాలు, దీనిని ఏ కీలుకు ఆ కీలు ఊడదీసి నిమిషాల్లో సోల్డరింగ్ రాడ్‌తో ఎంచక్కా అతుకు పెట్టుకోవచ్చు. ఇంత ఒద్దికయిన ఈ రోబో విద్యుత్ మోటార్ ఆధారంగా పని చేస్తుంది.

చేయాలో పాలుపోలేదు. ఏమీ చేయనూ లేదు. నిన్నటికి దుర్భరంగా వున్నది మాత్రం వాసనే. ఈరోజు ఈ ఇబ్బంది కూడా. ఆ వికార భావం మనస్సుకి తాకకుండా చూసుకుంటూ 'శరీరంలో ఏ అవయవానికైనా స్పర్శ తెలుస్తూ వుందా?' అనుమానంగా అనుకున్నాడు.

'బయటపడగానే శుభ్రంగా స్నానం చెయ్యాలి. ఎండకే చీదర ఇహ. ఇప్పుడిది' అనుకున్నాడు.

మళ్ళీ సందడి మొదలయింది.

''రవీ...'' తండ్రి పిలుపు.

''నీ పెళ్ళామొచ్చిందిరా...''

తెలియని భావంతో రవి మనసు అల్లల్లాడిపోయింది.

''లక్ష్మీ!'' ఆర్తిగా పిలిచాడు.

కళ్ళల్లోంచి దూకుతున్న నీటిని తుడుచుకుంటూ 'ఊ' అంది.

''దగ్గరకు రా...'' పిల్చాడు నీరసంగా.

వచ్చింది. లక్ష్మి శరీర మృదుత్వం చేతికి తగులుతూ వుంది. ఓరగా చూశాడు. కంటి కంటే చేతికే ఎక్కువ తెలుస్తూ వుంది లక్ష్మి రవికి. కొండకు వచ్చేటప్పుడు తాను చూసిన మెరుస్తున్న లక్ష్మి మోహన రూపం గుర్తొచ్చింది. చేతిని కదిపాడు. ముఖాన్ని స్పృశించాడు. ముఖమంతా తడిమాడు. ఆ బుగ్గలు పుణికాడు. నోట్లోంచి మాట రాలేదు. గొంతులో ఏదో ఉండ చుట్టుకుపోయినట్టుంది. లక్ష్మీ కళ్ళు తుడిచాడు. తేరుకుని... ''పిచ్చిమొహం దానా.. ఏడవకు వచ్చేస్తాలే'' చెప్పాడు.

''బిడ్డేం చేస్తున్నాడు? అమ్మదగ్గర వదిలి వచ్చావా?'' అడిగాడు.

సమాధానం లేదు.

''నాన్నా! లక్ష్మిని ఇంటికి తీసుకెళ్ళు. ఇంట్లో బిడ్డ వున్నాడు. ఎండ ఎక్కుతుంది త్వరగా వెళ్ళండి. లక్ష్మీ... వెళ్ళు నే వచ్చేస్తాగా'' సర్దిచెప్పాడు.

తండ్రి ఎంతో నచ్చచెప్పిన తర్వాత రవి చేతిని వదల్లేక వదిలి కదిలింది లక్ష్మి.

* * *

ప్రభుత్వాధికారులు వైద్యులు వచ్చారు. రవి వున్న కొండరాళ్ళ చుట్టూ భరింపరాని దుర్వాసన. ఎండ తీవ్రత ఎక్కువగా వుంది. ఆ ఎండలో కొండ పైకి ఎక్కిరాలేక ఆర్డీవో కళ్ళు తిరిగి పడిపోయాడు. పరిస్థితి అన్ని రకాలుగానూ దుర్భరంగా వుంది. అధికారులు తర్జనభర్జన పడి, ఆ కొండరాళ్ళను తొలగించటానికి క్వారీ కార్మికులకు కబురు చెయ్యాలని నిర్ణయించారు.

గత మూడు రోజులుగా సరైన తిండిలేని నీరసంతో వున్న రవికి సమస్య జటిలత భయం కలిగిస్తూ వుంది.

''తొందరగా ఏదైనా చెయ్యండిసారూ బిడ్డ అన్యాయమైపోతాడు'' తిరిగి వచ్చిన తండ్రి ఆవేదన.

క్వారీ కార్మికులకు కబురు వెళ్ళింది.

''ఇంత పెద్ద రాయి ఉత్తి సుత్తితో ఎప్పటికి పగలగొడ్తారు'' ఎవరో అన్నారు.

''పోనీలే ఫలిస్తే అంతకంటే కావలసిందేముంది?'' మరొకరు.

''ఇప్పటికే మూడు రోజులు ఏమైపోతాదో ఆ రాళ్ళ మధ్య'' ఇంకొకరి ఆవేదన.

క్వారీ కార్మికుల కోసం చూస్తూ, చిన్నా చితక ప్రయత్నం చేస్తున్నారు. పొద్దు పొడిచింది కాని, క్వారీ కార్మికులు రాలేదు. అధికారులు రేపొద్దుటే ప్రయత్నిద్దాం అంటూ వెళ్ళారు.

ఇదంతా ఆలకిస్తున్న రవికి ధైర్యం సన్నగిల్లింది. నిరాశ మనసంతా ఆవరించుకుంటుంటే తనను తాను నిలువరించుకొంటున్నారు. ఎవరున్నారో ఎవరెళ్ళారో అడిగే పట్టించుకునే స్థితిలో లేడు. ఎప్పుడు చీకటైందో రాత్రైందో తెలియదు. మగతెప్పుడు కమ్ముకొంటుందో, మెలుకువ ఎప్పుడు వస్తుందో కూడా తెలియని స్థితి. రవితో ప్రమేయం లేకుండా ఎప్పుడో తెల్లవారింది.

* * *

తొందరగానే అధికారులు వచ్చారు. క్వారీ కార్మికులూ వచ్చారు. గ్రామస్థులు బండను పగలకొట్టే పనిలో పడ్డారు. మధ్యాహ్నానికి కొంత తెరిపిన పడ్డాక తాడుతో లాగే ప్రయత్నం చేశారు. ఓపిక లేకపోయినా జనం చేసే ప్రయత్నానికి సహకరించాడు రవి. తాడును లేని ఓపిక తెచ్చుకుని గట్టిగా పట్టుకున్నాడు. ఏ మాత్రం ఉపయోగం లేకపోయింది. స్పర్శ కోల్పోయిన శరీరం వల్ల ఏమేమి గాయాలవుతున్నాయో కూడా రవికి తెలియటం లేదు.

ప్రయత్నాలు వేగవంతం చేయమని గ్రామస్థులు అధికారులను తొందరపెడుతున్నారు. పరిస్థితిని ఎలా అదుపు చెయ్యాలో, ప్రయత్నాలు ఎప్పటికి ఫలిస్తాయో తెలియని అధికారులు చిర్రుబుర్రులాడుతున్నారు. విసుక్కొంటున్నారు. అరుస్తున్నారు.

వైద్యులు తిండి నీరు మందులు అందించారు రవికి. సెగలు కక్కే బండరాళ్ళు నిప్పులు చెరిగే ఎండ తీరని దాహార్తి వడదెబ్బ తగిలే అవకాశాలను అధికారులు విస్మరించలేదు. అప్పటికే రవికి విరేచనాలు అదుపులో లేవు.

'ఏమైపోతాడు...' మరణం సంభవించే అవకాశాల సూచన వుంది. ఇది గ్రామస్థుల బాధ.

'ఆ తండ్రిని చూడండి. కంట్లో ప్రాణాలతో ఇంటికి పోకుండా ఎదురు చూస్తున్నాడు' ఎవరో దిగులుగా మాటామంతి లేకుండా కూచొన్న రవి తండ్రిని చూపారు.

''తండ్రిని కాదు ఇంట్లో వున్న పసికూనను చూడండి''

''అదంతా అలా వుంచండి. ఈ బండరాళ్ళలో ఇరుక్కుని నాలుగు రోజులయింది. సరైన తిండిలేదు. మండే ఎండలు. చావడు కదా'' మరొకరి భవిష్యవాణి.

''చనిపోయాకైనా ఇక్కడ నుంచి తియ్యగలరా?'' మరెవరో కఠిన హృదయుల దయాపూర్ణమైన మాట.

చుట్టూ వున్న వాళ్ళు కొందరు నిజమేనన్నట్టు తలూపితే ఇంకొందరు ఆ మాటలు అన్న వాడిని మందలించారు.

నిస్త్రాణంగా వున్న రవి చెవిలో అన్ని మాటలూ పడుతున్నాయి. జీవితం పట్ల జీవించాలనే ఆశపట్ల రవిలో ఆలోచన సాగటం లేదు. మౌనంగా వున్నాడు. చీకటవుతూ వుంది. కిందకు పోలేని అధికారులు అక్కడే రవి తండ్రితోపాటు పడుకున్నారు. ఆ రాత్రి వారికి పెట్రోమాక్స్ లైట్ల వెలుగు తోడు.

మగతగా మూసుకుపోతున్న కళ్ళ ముందు రవికి, చిన్ననాడు తనను పట్టుకుని తలస్నానం చేయించటానికి వెంటపడే తల్లి కనిపించింది. చిన్ని కొడుకుకి పాలబువ్వ తినిపించే లక్ష్మి కనిపించింది. తండ్రితో ముచ్చట్లాడుతూ నులకమంచంపై తాను కూచోవడం గుర్తొచ్చింది. అల్లిబిల్లిగా కంటిముందు దృశ్యమాలిక. రవికి ఇహలోకంతో సంబంధం లేనట్టుగా వుంది. కలో నిజమో తన బాల్యమో తన కొడుకు బాల్యమో ఏది వేరో అంతా ఒకటేనో తెలియని స్థితిలో వున్నాడు. క్రమంగా అన్నీ దూరమై చీకటై ఒక నిశ్శబ్దత రవిని ఆవరించుకుంది.

* * *

తెల్లవారింది. అధికారులు నిద్రలేవగానే రవి దగ్గరకొచ్చారు. పిల్చారు. రవికి ఆ పిలుపు ఎక్కడో సుదీర తీరాలలో వినిపిస్తూ వుంది. పలకాలనే తపన రవిలో లేదు. అధికారులు మళ్ళీ మళ్ళీ పిల్చారు. ఎప్పటికో లోపల నుంచి మూలుగు లాంటి శబ్దం సమాధానంగా వచ్చింది. రవి అతి ప్రయత్నం మీద ఆ మాత్రం పలకగలిగాడు. అధికారులు పనులు వేగవంతం చేశారు. మనిషిని బయటకు తీయగానే అవసరమైన వైద్య సహాయంతో డాక్టర్ సిద్ధంగా వున్నారు. రవి నాడి చూస్తూనే వున్నాడు. అందరూ రవిని పలకరిస్తున్నారు. రవి తీరు అధికారులకు ఆందోళన కలిగిస్తూ వుంది.

కొండరాయి మరింత పగులగొట్టారు. మరొకసారి రవిని లాగే ప్రయత్నం చేశారు. ఈసారి రవి ప్రమేయం ఏమీ లేదు. రవిని స్పృహ తప్పకుండా చేయటానికి అధికారులు మాట్లాడిస్తున్నారు. పిలుస్తున్నారు.

రవికి మూసుకొన్న కళ్ళలో తడబడి కొడుకు బుజ్జి బుజ్జి పాదాలూ, వచ్చేటప్పుడు ముగ్ధమోహనంగా కనబడిన లక్ష్మి మొహం కనబడ్డాయి. ఓ చిరునవ్వు విరిసింది. ఆ గుర్తులతో కదలాడిన కనుపాపలూ ఆ చిరునవ్వు రవి మొహాన్ని వెలిగించాయి.

★

కొండరాయి మరింత పగులగొట్టారు. మరొకసారి రవిని లాగే ప్రయత్నం చేశారు. ఈసారి రవి ప్రమేయం ఏమీ లేదు. రవిని స్పృహ తప్పకుండా చేయటానికి అధికారులు మాట్లాడిస్తున్నారు. పిలుస్తున్నారు.
రవికి మూసుకొన్న కళ్ళలో తడబడి కొడుకు బుజ్జి బుజ్జి పాదాలూ, వచ్చేటప్పుడు ముగ్ధమోహనంగా కనబడిన లక్ష్మి మొహం కనబడ్డాయి. ఓ చిరునవ్వు విరిసింది. ఆ గుర్తులతో కదలాడిన కనుపాపలూ ఆ చిరునవ్వు రవి మొహాన్ని వెలిగించాయి.